ప్రజాశక్తి
సోమవారం 24 నవంబరు, 2025

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక
కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు వారి అర్జీల నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి స్థితి, దానికి సంబంధించి సమాచారం గురించి తెలుసుకోవాలంటే 1100 నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇక్కడ చేపలు అమ్మబడవు

- నిరుపయోగంగా ఫిష్ స్టాల్స్ సముదాయం
- రోడ్డుపై చేపలు అమ్ముతున్న చిరు వ్యాపారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

చేపలు వేటాడేవారు తమ చేపలు తాము అమ్ముకుంటే మెరుగైన ధర, వినియోగదారులకు ప్రయోజనం అన్న లక్ష్యంతో మత్స్యశాఖ 2023లో మత్స్యకారుల కోసం జిల్లా వ్యాప్తంగా డాక్టర్ వైఎస్ఆర్ ఫిష్ ఆంధ్ర మినీ స్టీల్స్ నిర్మించింది. జిల్లాలో మత్స్యకారులు ఉన్న ప్రాంతాల్లో ఈ స్టాల్స్ వంద వరకు నిర్మించారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం నగర పాలక సంస్థ విలీన పంచాయతీ పరిధి, ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధి గ్రామమైన కుశాలపురం పంచాయతీలోని యాతపేట సమీపంలో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు అనుకొని 19 డాక్టర్ వైఎస్ఆర్ ఫిష్ ఆంధ్ర మినీ స్టాల్స్ సముదాయం ఏర్పాటు చేశారు. 2023 జూలై 8న ఈ సముదాయం ప్రారంభించారు. అప్పటి మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజుతో పాటు, పలువురు ప్రముఖులు ప్రారంభించారు. మొత్తం 19 స్టాల్స్ రూ.47.50 లక్షలతో నిర్మించారు. ప్రధానంగా రణస్థలం, ఎచ్చెర్ల మండలాలకు చెందిన కొవ్వాడ మత్స్యలేశం, జీరుపాలెం, అల్లివలస, బడివానిపేట, బుడగుట్లపాలెం, జాలారు కొయ్యాం, డి.మత్స్యలేశం ప్రాంతలకు చెందిన మత్స్యకారులకు కేటాయించారు. ఈ స్టాల్స్‌లో నాలుగు మాత్రమే నిర్వహిస్తున్నారు. 16 స్టాల్స్ మూత పడ్డాయి. ప్రారంభించిన నెల రోజుల లోపే స్టాల్‌లు మూతపడినా అధికారుల్లో స్పందన లేదు.

మూతపడిన చేపల స్టాల్స్

ఎందుకు మూత పడ్డాయి...

వీధుల్లో చేపలు అమ్మేవారికి ఈ షాపులు కేటాయిస్తే నిర్వహణకు అవకాశం ఉండేది. చేపలు వేటాడే మత్స్యకారులకు కేటాయించారు. వీరు హోల్‌సేల్‌గా అమ్మేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కొన్ని మేలు రకాలు జాతులు బయిట ప్రాంతాలకు అమ్ముతున్నారు. ప్రస్తుతం ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకున్న చెరువు చేపల ఎక్కువగా నిర్వహిస్తున్న స్టాల్స్ అమ్ముతున్నారు. కొందరు మత్స్యకారులు ఈ షాపులు అద్దెలకు ఇచ్చుకోవాలనుకున్న కోణంలో రాజకీయ సిఫార్సులు చేసి తీసుకున్నారు. అద్దెలకు డిమాండ్ లేకపోవటంతో మూతపడ్డాయి. 19 స్టాల్స్ ఒకేచోట ఉంటే కొనుగోళ్లకు సైతం ప్రజలు ఇక్కడికి ఆ స్థాయిలో రావాలి. రైతుబజారు, పొట్టిశ్రీరాములు మార్కెట్ (పెద్ద మార్కెట్), బాల భారతి కూడలి ఇలా చాలాచోట్ల చేపలు వీధులు పక్క, డే అండ్ నైట్ సమీపంలో నాగావళి నది వంతెనపై పుట్ పాత్‌పై చేపలు అమ్ముతున్నారు. దీంతో ఇక్కడ డిమాండ్ అంతగా ఉండదు. నగర కార్పొరేషన్ ప్రజలకు యాతపేట దూరం కావడంతో కొనుగోలుదారులు రావడం లేదు. లక్షల్లో పెట్టుబడి పెట్టిన ఈ షాపులు వృథాగా పడి ఉన్నాయి. నిర్వహించని వారి స్థానంలో మరొకరికి ఇవ్వడం, చికెన్, మటన్ వంటి దుకాణాలకు అప్పగించినా వినియోగంలోకి వస్తాయి.

శిలాఫలకం

ప్రజాధనం వృథా

జిల్లాలో అధికారపు లెక్కలు మేరకు 4133 మోటారు బోట్లపై 15548 మంది చేపలు వేట ఆధారంగా జీవిస్తున్నారు. మరొ కొందరు సంప్రదాయ పడవులపై వేట సాగిస్తున్నారు. అర్ధరాత్రి వెళ్ల వీరు ఉదయం ఒడ్డుకు చేరుతారు. వీరి కుటుంబ సభ్యులు అమ్మకం చేయాలి. లేదంటే వీరికి సాధ్యం కాదు. వీధి వ్యాపారులు లక్ష్యంగా స్టాల్స్ కేటాయిస్తే వినియోగం సాధ్యమయ్యేది. ప్రస్తుతం లక్షల్లో ఖర్చు చేసిన ఈ స్టాల్స్ వృథాగా పడి ఉండటం అంటే ప్రభుత్వ ధనం వృథాగా చెప్పవచ్చు.

వినియోగంలోకి తెచ్చే చర్యలు

షాపులు వినియోగంలోకి తెచ్చే ప్రయత్నం చేస్తారు. ఎందుకు లబ్ధిదారులు నిర్వహించడం లేదన్న అంశాన్ని తెలుసుకుంటాం. జిల్లా పరిశీలించి, వినియోగంలోకి తీసుకొస్తే ప్రయత్నం చేస్తాం, స్టాల్స్ కేటాయించిన వారు నిర్వహణకు ఆసక్తి లేకపోతే మా దృష్టికి తీసురావాలి.

– వై.సత్యనారాయణ, మత్స్యశాఖ జెడి

వీధుల్లో చేపలు అమ్ముతున్నారు

చాలా మంది వీధుల్లో, రోడ్డు పక్క చేపలు అమ్ముతున్నారు. అలా కాకుండా రాజకీయ పలుకుబడి ఆధారంగా స్టాల్స్ కేటాయింపులు చేశారు. అవసరం ఉన్న వారికి కేటాయిస్తే వినియోగించేవారు. అనర్హులు, ఆసక్తి లేని వారికి కేటాయింపులు వల్ల స్టాల్స్ మూతబడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులకు కేటాయింపులు చేయాలి.

– అంబటి రాంబాబు, బుడగుట్లపాలెం

ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న వ్యాన్
- మధ్యప్రదేశ్‌కు చెందిన నలుగురు మృతి
- మరో ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కోటబొమ్మాళి మండలం జాతీయ రహదారిలో ఎత్తురాళ్లపాడు గ్రామ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో నలుగురు యాత్రికులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఆరుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పది మంది టూఫాన్ వాహనంలో కాశి, అయోధ్య, ఒడిశాలోని పూరి జగన్నాథ్ దర్శనం చేసుకుని, శ్రీశైలం వెళ్లేందుకు బయలుదేరారు. రాత్రి రెండు గంటల సమయంలో ఎత్తురాళ్లపాడు గ్రామ సమీపంలో రోడ్డు పక్క నిల్చుని ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదానికి గురైన టూఫాన్ వాహనం డ్రైవర్ నిద్రమత్తుకు లోనవడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన బోరో సింగ్ పవర్ (60), విజయ్ సింగ్ తోమర్ (65), ఉషీర్ సింగ్ (62), సంతోషి బాయ్ (62)లు అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ సునీల్ పటేల్, సంతోష్ బాయ్, సిమాన్ భాయ్, చీర బాయ్, సావిత్రిబాయి, శకుంతల బాయిలు గాయపడ్డారు. వీరిని నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం హైవే అంబులెన్స్ సహాయంతో తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. వీరిలో ఒకరికి తలకు, ముగ్గురికి నడుం భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు తమ బంధువులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వి.సత్యనారాయణ ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. సిఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇదే సంఘటనా స్థలంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల కాలంలో ఇక్కడే సంభవించిన ఓ రోడ్డు ప్రమాదంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన వారు మృతి చెందారు. దీంతో పరిసర ప్రాంత ప్రజలకు ఆందోళనకు గురిచేస్తుంది.

ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఎస్‌పి సందర్శన

కోటబొమ్మాళి పోలీసు స్టేషన్ పరిధిలోని ఎత్తురాళ్లపాడు వద్ద ఆదివారం వేకువజామున జాతీయ రహదారిపై సంభవించిన రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి, టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి స్వయంగా సందర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేలా ఆర్‌డిఒ పర్యవేక్షిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలను పరిశీలించి, సంబంధిత అధికారుల నుంచి వివరాలను సేకరించారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు అందిస్తున్న వైద్య సేవలపై సమాచారం తీసుకుకున్నారు. అవసరమైన అన్ని సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వివరాలు సేకరించారు.

మాట్లాడుతున్న గోవిందరావు

రేపు 'చలో తహశీల్దార్'

ప్రజాశక్తి- సరుబుజ్జిలి, బూర్జ

మండలంలోని వెన్నెలవలస థర్మల్ పవర్ ప్లాంట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ... ఈ నెల 25న ఉదయం 9.30 గంటలకు చలో సరుబుజ్జిలి తహశీల్దార్ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో థర్మల్ పవర్ ప్లాంట్ ప్రభావిత గ్రామాలైన వెన్నెలవలస, వడ్లపాడు, జంగాలపాడు, అడ్డూరుపేట, మసాలాపుట్టుగా, బొమ్మిక, సాకలిగూడ, అన్నంపేట, తదితర గ్రామాల్లో ఆదివారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామసభల్లో నాయకులు మాట్లాడుతూ బలవంతపు భూసేకరణ ఆపాలన్నారు. ఇండోసోల్ థర్మల్ పవర్ ప్లాంట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వెన్నెలవలస కూడలి నుంచి భారీ ర్యాలీ అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, ఆదివాసీ వికాస్ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, సిపిఐ నాయకులు ఎస్.సంతోష్, పోరాట కమిటీ నాయకులు సమర సింహాచలం, బొడ్ల సురేష్, సవర లక్ష్మణరావు, సవర మహేష్, సవర చిన్నారావు, అదపాక రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతంగా నిర్వహించినట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ప్రకటించింది. భారత దేశ ప్రఖ్యాతి గాంచిన శాస్త్రవేత్తలు సర్ సివి రామన్, ఎల్లాప్రగడ సుబ్బారావు చిత్రపటాలకు జనవిజ్ఞాన వేదిక నాయకులు పూలమాలలు వేసి వారి సేవలను కొనియాడారు. జనవిజ్ఞాన వేదిక ఎడ్యుకేషన్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఎ.సూర్యచంద్రరావు, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలినాయుడు, టెక్కలి ఉప విద్యాశాఖ అధికారి పి.విలియం, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రదీప్, పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆదినారాయణమూర్తి, శ్రీకాకుళం అర్బన్ మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.సుజాత, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, హెడ్మాస్టర్ అసో సియేషన్ జిల్లా అధ్యక్షులు వి.సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి విద్యార్థులు, ప్రజలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులు, నిర్వాహకులు

జిల్లా స్థాయి విజేతలు...

చెకుముకి జిల్లా స్థాయి సైన్స్ సంబరాల్లో ప్రథమ స్థానాన్ని ప్రభుత్వ విభాగం నుంచి సారవకోట మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నకిట్టాలపాడు విద్యార్థులు కె.హర్షవర్ధన్, పి.దుర్గాప్రసాద్, కె.సింధుప్రియ, ప్రైవేట్ విభాగం నుంచి ప్రథమ స్థానాన్ని శ్రీకాకుళం ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు భానుశ్రీదాస్, ఎస్.జస్వంత్, ఎస్.యశ్వంత్ కైవసం చేసుకున్నారు. ద్వితీయ స్థానాన్ని ప్రభుత్వ విభాగం నుంచి పొందూరు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కింతలి విద్యార్థులు, ప్రైవేట్ విభాగం నుంచి శ్రీకాకుళం గీతాంజలి స్కూల్ విద్యార్థులు, తృతీయ స్థానాన్ని ప్రభుత్వ విభాగం నుంచి ఆమదాలవలస మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అక్కులపేట విద్యార్థులు, ప్రైవేట్ విభాగం నుంచి మందస మండలం గీతం హైస్కూల్ హరిపురం విద్యార్థులు, అరుణ విద్యాలయం టెక్కలి విద్యార్థులు గెలుపొందారు. కన్సోలేషన్ బహుమతులను కవిటి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాణిక్యపురం, కవిటి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్యాలపేట, బూర్జ మండలం ఓ.వి.పేట ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు గెలుపొందారు. చెకుముకి సైన్స్ సంబరాల్లో 30 మండలాల నుంచి 75 టీమ్‌లతో 225 మంది విద్యార్థులు, 110 మంది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. కార్యక్రమంలో నీరజ సుబ్రహ్మణ్యం శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ప్రముఖ మెజీషియన్ సిహెచ్. ఉమామహేశ్వరరావు మ్యాజిక్ షోను నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పార్టిసిపేషన్ ధ్రువపత్రాలు, విజేతలకు, పాఠశాలలకు మెమెంటోలు, పుస్తకాలతో కూడిన బహుమతులను అందిందించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కొత్తకోట అప్పారావు, జిల్లా సైన్స్ అధికారి ఎన్.కుమార్‌స్వామి, జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు, ఎస్.సాయిశ్రీనివాసశర్మ, బొడ్డేపల్లి జనార్ధనరావు, ఎపి ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.రాజశేఖర్, ఎపి జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరి, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, చెకుముకి సైన్స్ సంబరాలు జిల్లా కన్వీనర్ జి.కూర్మారావు, జిల్లా కోశాధికారి వి.ఎస్.కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సామ సంజీవరావు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఆగతముడి వాసుదేవ రావు, జెవివి జిల్లా కార్యదర్శి పూజారి గోవిందరావు, ఆర్.సురేష్‌బాబు, శాంతి ప్రియ పాల్గొన్నారు. ఆన్‌లైన్ ప్రయోగ వీడియోలు కంటెస్ట్ యురేకా సైన్స్ ఎక్స్పోలో విద్యార్థులు పాల్గొనాలని జిల్లా జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి కుప్పిలి కామేశ్వరరావు పిలుపునిచ్చారు. గెలుపొందిన మొదటి టీమ్‌లు డిసెంబరు 12, 13, 14 తేదీల్లో కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొంటారని పి.కూర్మారావు, గొంటి గిరిధర్ తెలిపారు.

ఉద్యోగుల ఉమ్మడి హక్కుల సాధనకు సమిష్టిగా పోరాటం

ఎపి జెఎసి రాష్ట్ర చైర్మన్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు సమిష్టి కృషి అవసరంగా ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పారాజు వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన పట్టణంలోని రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో ఆదివారం రెవెన్యూ ఉద్యోగులు, ఎపిజెఎసి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో జిల్లాలోని రెవెన్యూ సర్వీసుల సంఘం, రెవెన్యూ ఉద్యోగులందరూ వారి ప్రత్యేకతను కనబర్చుతూ మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఇదే పంథాను అనుసరిస్తూ భవిష్యత్‌లో ఐక్యమత్యంతో విధి నిర్వహణలోనూ చూపుతూ ప్రజలకు చేరువ కావాలని చెప్పారు. రెవెన్యూశాఖ ఔన్నత్యాన్ని పెంచుతూ, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకుని రావాలని కోరారు. అమరావతిలోని అన్ని సభ్య సంఘాల నాయకులతో ఈ సందర్భంగా ఒక సమావేశం ఏర్పాటు చేసి, అన్ని శాఖాపరమైన సంఘాల నాయకులు, ఉద్యోగులు ఐకమత్యంతో కలసి, మెలిసి ఉండాలని చెప్పారు. ఉద్యోగుల సమస్యలపై అవగాహనతో కలిసి ఉండాలన్నారు. జిల్లా, రాష్ట్ర ఎపి జెఎసి అమరావతి నాయకత్వాలు ఎప్పుడు ఎలాంటి పిలుపులు ఇచ్చినా సంసిద్ధంగా ఉండాలన్నారు. ఉద్యమం చేయడం ఎపి జెఎసి అమరావతి ప్రధాన లక్ష్యం కాదని, సమస్యల పరిష్కారం ప్రధాన ధ్యేయమని తెలిపారు. ఈ ప్రభుత్వం ప్రధానంగా ముఖ్యమంత్రి సమస్యల సానుకూల పరిష్కారానికి సంసిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. తప్పకుండా ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కారం చూపుతారని నమ్మకం ఉందని తెలిపారు. ఉద్యోగుల ఉమ్మడి హక్కుల సాధనకు సమిష్టిగా అందరం కలిసి పనిచేయాల్సి ఉందని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎపి జెఎసి అమరావతి చైర్మన్ కె.శ్రీరాములు, సెక్రటరీ జనరల్ ఎస్.వి.రమణ, మహిళా విభాగం చైర్మన్ కె.ప్రవల్లికప్రియ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

చెప్పడు మాటలకే జగన్ ప్రాధాన్యం

- రాజకీయాలకు దూరంగా ఉన్న
- మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ప్రస్తుతం ఏ పార్టీలో లేనని రాజకీయాలతో దూరంగా ఉంటున్నానని మాజీ ఎంపీ విజయసారెడ్డి అన్నారు. మండలంలోని అంపోలు రోడ్‌లో ఉన్న నూతనంగా నిర్మాణం చేపడుతున్న రెడ్డి సామాజిక తరగతి భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎక్కువగా చెప్పుడు మాటలకు ప్రాధాన్యతన ఇస్తున్నారని అన్నారు. అందువల్లే ఆయనకు, నాకు మధ్య విభేదాలు వచ్చాయని తెలిపారు. మాజీ సిఎం వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి అంటే నాకు చాలా గౌరవమని, ఆయన వద్ద చాలా ఏళ్లు పనిచేశానని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఏ పార్టీలో లేనని, తాను రాజకీయాలకు దూరంగా ఉంటున్నానని తెలిపారు. తమ సామాజిక తరగతి భవన నిర్మాణం పూర్తిగా నా సొంత డబ్బులతోనే నిర్మిస్తారని తెలిపారు. ప్రస్తుత రాజకీయాలు పరిస్థితి తనకు తెలియదని వ్యాఖ్యానించారు. ఆయనతోపాటు రెడ్డి సామాజిక తరగతి సభ్యులు ఉన్నారు.

మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

జిల్లాలో బెల్ట్ షాపులు లేవు

- పారదర్శకంగా మద్యం విధానం అమలు
- సమయం పాటించేలా చర్యలు
- కల్తీ మద్యానికి చోటు లేదు
- ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా నాణ్యత తెలుసుకోవచ్చు
- జిల్లా ప్రాహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి తిరుపతిరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలో బెల్‌షాపులు ఒక్కటి కూడా లేదని, పారదర్శకంగా మద్యం అమ్మకం, షాపులు నిర్వహణ చేపడుతున్నట్లు జిల్లా ప్రాహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సిహెచ్.తిరుపతిరావు తెలిపారు. వినియోగదారులకు మద్యం నాణ్యత ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా తెలుసుకోవచ్చునని చెప్పారు. అందుబాటులో నాణ్యమైన మద్యం ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో కల్తీ మద్యం సంఘటనలు చోటు చేసుకోలేదని అన్నారు. ముఖిముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి పలు అంశాలు వెల్లడించారు.



? మద్యం అమ్మకం, మద్యం షాపుల నిర్వహణ ఎలా ఉంది?

జిల్లాలో మద్యం అమ్మకాలు, మద్యం షాపుల నిర్వహణ పారదర్శకంగా కొనసాగుతుంది. 30 మండలాల్లో, నాలుగు మున్సిపాలిటీల్లో 176 మద్యం షాపులు ఉన్నాయి. తొమ్మిది బార్లు నిర్వహిస్తున్నారు. మద్యం షాపులు ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు, బార్లు ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు నిర్వహణ ఉంది. పక్కాగా ప్రభుత్వం నిర్ణయించిన సమయం అమ్మకాలు చేపడుతున్నాం. నిర్దేశించిన సమయం కచ్చితంగా మద్యం షాపులు, బార్లు అమలు చేయాలి.

? జిల్లాలో బెల్ట్ షాపుల పరిస్థితి ఏమిటి?

జిల్లాలో బెల్ట్ షాపులు లేవు. బెల్ట్ షాపులు పూర్తిగా నియంత్రించాం. మద్యం షాపుల్లో మూడు బాటిల్‌లకు మించి వినియోగదారులకు ఇవ్వరు. అమ్మకంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. నిబంధన అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం సైతం బెల్టు షాపులపై కఠినంగా వ్యవహరించమని ఆదేశాలు ఇస్తుంది.

? ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్ వల్ల ప్రయోజనం ఏమిటి?

వినియోగదారులు ఈ యాప్ ద్వారా మద్యం నాణ్యత తెలుసుకోవచ్చు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయడం వల్ల మద్యం నాణ్యత, ధర, పరిమాణం, తయారైన తేదీ, తయారు చేసిన కంపెనీ వంటి పూర్తి వివరాలు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి. తాను కొన్న మద్యం పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. సమస్య ఉంటే ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది. శతశాతం పారదర్శకంగా మద్యం అమ్మకం ఉంది. గూగుల్ ప్లేస్టోర్‌లో ఈ యాప్ అందుబాటులో ఉంది.

? జిల్లాలో మద్యం ఆదాయం ఎలా ఉంది?

నెలకు రూ.80 కోట్ల వరకు మద్యం ఆదాయం ఉంటుంది. రోజుకు రూ.2.30 కోట్లు కనీస వ్యాపారం అవుతుంది. ఇండెంట్లు ఆధారంగా మ ద్యం షాపులకు సరఫరా ఉంటుంది. డిస్ట లరీల నుంచి వచ్చిన మద్యాన్ని బేవరేజె స్ కార్పొరేషన్ వైన్ షాపులకు, మద్యం షాపులకు సరఫరా ఉంటుంది. దసరా, సంక్రాంతి వంటి సీజన్‌లో మద్యం అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి.

? మద్యం, బారుల్లో అమ్మకాలు ఎలా ఉన్నాయి?

నిర్దేశించిన సమయంలో అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. మద్యం షాపుల్లో మూడు బాటిళ్లు మాత్రమే కచ్చితంగా ఒక వ్యక్తికి అమ్మాలి. ఎంఆర్‌పి పక్కగా అమలు కావాలి. అన్ని నిబంధనలు పర్యవేక్షిస్తున్నాం. నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం.

ధ్రువీకరణ పత్రాలతో విజేతలు, నిర్వాహకులు

నవోదయ మోడల్ పరీక్షకు స్పందన

శ్రీకాకుళం సిటీ: ఎచ్చెర్ల నియోజకవర్గ స్థాయి నవోదయ పరీక్షను ఆదివారం ఏపి యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఐదవ తరగతి విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాశారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఒఎంఆర్ విధానంలో పరీక్ష నిర్వహించారు. ప్రశ్నాపత్రం శాస్త్రీయంగా వెంకటేష్, జగదీష్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ కె.పున్నయ్య హాజరయ్యారు. విద్యార్థులకు ఈ పరీక్ష ఉపయోగ పడుతుందని, పాత మోడల్ ప్రశ్నపత్రాలు, సిలబస్ బ్లూప్రింట్ పరిగణలోకి తీసుకోవాలని చెప్పారు. ఈ పరీక్షను యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామమూర్తి, రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి.అప్పారావు, వై.ఉమాశంకర్ పాల్గొన్నారు. 209 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షల్లో భగీరథపురం పాఠశాల విద్యార్థి సిహెచ్ తేజస్వకుమార్, గుంటుకుపేటకు చెందిన కె.డిల్లీశ్వరరావు, లంకపేటకు చెందిన ఎస్.పార్థు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరిని ప్రధాన కార్యదర్శి అభినందించారు. యుటిఎఫ్ నాయకులు సురేష్, శ్రీరామచంద్రమూర్తి, కె.రామారావు, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

కేంద్రమంత్రిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలంలోని కీర్తిపురంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రి మంత్రి క్యాంప్ కార్యాలయంలో పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు వచ్చే వారికి షెడ్ లాంటి సదుపాయం లేకపోవడంతో వర్షాలు కురిసే సమయంలో చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆదివారం కమ్యూనిటీ భవనం నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లోపింటి పద్మనాభం, దక్షత ఢిల్లీరావు, బాలరాజు, చలపతి, పురుషోత్తం, సింహాద్రి పాల్గొన్నారు.

డిసెంబరు 31 నాటికి ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

మల్లేశ్వరరావు

డిసెంబరు 31 నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు చెన్నారు మల్లేశ్వరరావు కోరారు. ఈ మేరకు పూండిలో ఆదివారం లబ్ధిదారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణశాఖ ద్వారా పేద సంక్షేమం ఇళ్ల నిర్మాణానికి పూనుకుందని అన్నారు. గతంలో ప్రభుత్వం మంజూరు చేసి మధ్యలో ఆగిపోయిన ఇళ్ల పనులు పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. లబ్ధిదారులకు అదనపు సహాయం కింద బిసి, ఎస్‌సిలకు రూ.50 వేలు చొప్పున, ఎస్‌టిలకు రూ.75 వేలు ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తారని తెలిపారు. ఆదివాసీ గిరిజనులకు రూ.లక్ష కూటమి ప్రభుత్వం అందిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకొని పేద వాని సొంతింటి కల నెరవేర్చుకోవాలని తెలిపారు.

ఆదినారాయణకు సన్మానం

రణస్థలం: రణస్థలం మండలం రావాడ గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు ముక్కు ఆదినారాయణ రాష్ట్ర ఎస్‌సి కమీషన్ మెంబర్‌గా నియమించడంతో శ్రీకాకుళం ఎంపీ కార్యాలయంలో ఆదినారాయణ ఆదివారం కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదినారాయణకు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం కష్టపడిన వారికి గుర్తింపు వస్తుందని, పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ పార్టీ మరింత బాధ్యత పెంచిందని, ఎంపీ చేతులమీదుగా సన్మానం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

కిక్‌బాక్సింగ్‌లో కీర్తన ప్రతిభ

ప్రశంసాపత్రం, మెడల్‌తో కీర్తన

పొందూరు: మండలం రాపాకకు చెందిన ఎచ్చెర్ల కీర్తన శ్రీకాకుళంలోని వైయస్సార్ కళ్యాణ మండపంలో నిర్వహించిన అస్మిత కిక్ బాక్సింగ్ లీగ్-2025లో అద్భుత ప్రతిభను కనబర్చింది. ఈ పోటీల్లో కీర్తన ప్రథమ స్థానంలో నిలవడంతో ప్రశంసా పత్రంతో పాటు మెడల్‌ను నిర్వాహకులు బహూకరించారు. చిన్నారికి కోచ్‌గా జానీమాస్టార్, అసిస్టెంట్ కోచ్‌గా తిరుపతిరావు శిక్షణ అందించారు. వీరికి నిర్వాహకులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఆశ్రమ పాఠశాలకు పుస్తకాలు వితరణ

కొత్తూరు: మండలంలోని గొట్టిపల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సైన్సు, విజ్ఞానం, మహనీయ చరిత్రలకు సంబంధించి పుస్తకాలను ఆదివారం ఐలు కమిటీ సభ్యులు ఆదివారం అందజేశారు. సుమారు రూ.పది వేలు విలువైన పుస్తకాలను స్టేట్ కమిటీ తరుపున నర్రా శ్రీనివాస్ విద్యార్థులకు పంపించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.అప్పారావు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయులు జీవిత చరిత్ర తెలుసుకోవాలన్నారు. సైన్స్ ఆధారంగా భవిష్యత్ కోసం విద్యార్థులు తయారు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లాయర్స్ యూనియన్ నాయకులు చింతాడ ప్రసాద్. రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భోజనశాల ప్రారంభం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని దుప్పలపాడుకు చెందిన కీర్తిశేషులు బొడ్డేపల్లి సూర్యనారాయణ జ్ఞాపకార్థం తన కు మారుడు అప్పలస్వామి, సుజాత దంపతులు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసేందుకు రూ.80 వేలు వ్యయంతో భోజన శాల నిర్మించారు. ఈ భోజనశాలను వైద్యులు బలగ మురళి ఆదివారం ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దాతలు ముందుకొచ్చి ఇటువంటి కార్యక్రమాలు చేపడితే అభివృద్ధిలో ప్రభుత్వాలకు తోడుగా ఉండవచ్చని అన్నారు. కార్యక్రమంలో సీపాన అన్నయ్య, నరసన్నపేట ఎంఇఒ పేడాడ దాలినాయుడు, సర్పంచ్ గువివెల్లి భారతి, వైస్ సర్పంచ్ జి.భారతి, ప్రధానోపాధ్యాయులు సిపాన త్రినాథరావు, ఉప్పాడ పూర్ణారావు పాల్గొన్నారు.

సేవా మార్గాన్ని అనుసరించాలి

లావేరు: చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న తహశీల్దార్, ఎంపిడిఒ

పొందూరు : నగర సంకీర్తనలో పాల్గొన్న సభ్యులు

ప్రజాశక్తి- అరసవల్లి

మానవసేవే మాధవసేవగా జీవితాన్ని గడపాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని సత్యసాయి బాబా ఆలయంలో సత్యసాయిబాబా శత జయంతి (100వ జయంతి) వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివారి విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి కేకును కట్‌చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ జయంతిని రాష్ట్ర వేడుకగా ప్రకటించిందని, పుట్టపర్తిలో జరిగే వేడుకల్లో రాష్ట్రపతి సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారని ఆయన తెలిపారు. కరువు సీమలో మంచినీరు, ప్రపంచస్థాయి విద్య, ఉచిత వైద్యసేవలను అందించిన మహనీయుడు సాయిబాబా అని కొనియాడారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ సత్యసాయి సందేశంతో ప్రేరణ పొందిన వారు దేశ, విదేశాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని సత్యసాయి సేవాసమితి చేస్తున్న సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ లక్ష్మణమూర్తి, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, ఆలయ భవన నిర్మాణ కమిటీ అధ్యక్షులు అందవర ప్రసాద్, జిల్లా కన్వీనర్ రామచంద్రరావు, మందిరం కన్వీనర్ మురళి, కృష్ణమూర్తి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే న్యూకాలనీ సత్యసాయి మందిరం కన్వీనర్ గుప్తా, భరద్వాజ్, ఆధ్వర్యంలో 100 కేజీల కేకు కట్ చేశారు. కలెక్టర్ బంగ్లా వద్ద నున్న మందిరంలో, శివబాలాజీ ప్రక్కన ఉన్న మందిరాల్లో కల్పతరువు పేరిట 100 మొక్కలు పంపిణీ చేపట్టారు. నగరంలో ఉన్న అన్ని మందిరాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు.

శ్రీకాకుళం సిటీ: సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లా పోలీసు కార్యాల యంలో చిత్రపటానికి అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు నివాళ్లర్పించారు. ఎఒ గోపినాథ్, ఆర్‌ఐ నరసింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లావేరు: లావేరు వస్త్రపురి కాలనీలో ఉన్న సత్యసాయిబాబా మందిరంలో సత్యసాయి వందవ జయంతి ఉత్సవాలు తహశీల్దార్ గురుగుబిల్లి ఈశ్వర శ్రీనువాసరావు, ఎంపిడిఒ పేడాడ వెంకటరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయిబాబా కమిటీ సభ్యులు తూతిక బాలరాజు దొర, రాజారమేష్, ఉప్పు వీర్రాజు, సభ్యులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని పొందూరు, తోలాపి గ్రామాల్లోని సత్యసాయి మందిరాల్లో సత్యసాయి జయంతి వేడుకలు ముగిసాయి. 100 కిలోల కేక్, 100 రకాల స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. సేవాసమితి కన్వీనర్ దున్న రాధాకృష్ణ, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని హరిపురంలో నిర్వహించిన సత్యసాయి శతజయంతి వేడుకల్లో వైసిపి టెక్కలి నియోజక వర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, శిష్టు నరేష్, గంగాధర్‌రావు, బి.వెంకట రమణ పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పోలాకి: పోలాకి, వెదుళ్లవలస, డోల, పిన్నింటిపేట గ్రామాల్లో నిర్వహించిన సత్యసాయి శతజయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, పి.రత్నాఖర్, జె.మహేష్, ఎస్.లక్ష్మీనారాయణ, డోల తిరుమలరావు, డోల జగన్, రుంకు తాత, శ్రీరాములు, బరాటం రామారావు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు.

టెక్కలి : టెక్కలిలో నిర్వహించిన సత్యసాయి శతజయంతి వేడుకలు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కోటబొమ్మాళి : మండలంలోని దుప్పలపాడు చెందిన గురువెల్లి అప్పన్న, భారతి దంపతుల నేతృత్వంలో సత్యసాయి శతజయంతి వేడుకలు నిర్వహించారు. రెండు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నరసన్నపేటకు చెందిన వైద్యులు బలగ మురళి, నరసన్నపేట ఎంఇఒ పేడాడ దాలినాయుడు, ఎల్ఐసి క్లబ్ మెంబర్, నరసన్నపేట కళింగ సంఘం అధ్యక్షులు ఉప్పాడ పూర్ణారావు, సర్పంచ్ గురువేల భారతి, అయ్యప్ప స్వాములను, విలేకరులను సన్మానించారు. 175 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సరస్వతి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ చాప భవానిశ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే కోటబొమ్మాళి మండల కేంద్రంలో సత్యసాయి మందిరం వద్ద నిర్వాహకులు ఐదు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళింగ కోమటి రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు పాల్గొన్నారు.

అరసవల్లి : మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

కోటబొమ్మాళి : సన్మానిస్తున్న అప్పన్న

వజ్రపుకొత్తూరు : మండలంలోని గోవిందపురం, బైపల్లి తదితర గ్రామాల్లో సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు నిర్వహించి అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు పాలిన శ్రావణి, వైసిపి జిల్లా నాయకులు పాలిన శ్రీనివాసరావు, గోవిందపురం సర్పంచ్ ప్రతినిధి పాలిన చిరంజీవి, కొంచాడ నూకరాజు, జగ్గు నాయుడు, కొంచాడ గోవిందరావు, పొట్నూరి గోవిందరావు, విజయలక్ష్మి, నాగమణి, బోయిన కేశవ పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని లక్కుపురం, మదనాపురం, కొల్లివలస, అల్లెన, తుడ్డలి, లాభాం తదితర గ్రామాల్లో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శత జయంతి వేడుకలు నిర్వహించారు. 100 మంది మహిళలకు చీరలు, పురుషులకు పైజామాలను పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీప, సమితి సభ్యులు పి.వెంకటి, కె.కృష్ణ, సిహెచ్ భూలోకం, ఎం.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాధను పరామర్శిస్తున్న యూనియన్ నాయకులు

రాధకు పరామర్శ

శ్రీకాకుళం సిటీ: ఇటీవల నరసన్నపేటలో జరిగిన నందన్న ఉత్సవాల సందర్భంగా డిజె సౌండ్‌కు శ్లాబ్ కుప్ప కూలడంతో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కోశాధికారి ఎ.రాధ, కుమార్తె ప్రమాదానికి గురై విశాఖపట్నం కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఇప్పటికీ కూడా కోలుకోలేని పరిస్థితిలో ఉన్నారు. ఆ కుంటాబానికి మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, అధ్యక్ష, కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర, ఉపాధ్యక్షులు టి.రామానుజమ్మ, ఎం. రామలక్ష్మి పరామర్శించి ఆర్థికసాయంగా రూ.10 వేలు అందించారు.

సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కళాకారులకు సన్మానం

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ పంచాయతీ మహసింగి సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి వచ్చిన కళాకారులు ఆదివారం కళ ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది కళాకారులకు ఆలయం తరుపున కమిటీ సభ్యులు దుశ్శాలువలు కప్పి సన్మానించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎఇ ఎ.మోహనరావు, సర్పంచ్ పిసిని లక్ష్మణరావు, అప్పనబాబు, కాంట్రాక్టరు రామారావు, సూర్య మాస్టర్, నంది అవార్డు గ్రహీత సిహెచ్.మోహిని, ఈశ్వరి, కొండేటి పార్వతీశం, ఆలయ కమిటీ సభ్యులు గోగుల వరప్రసాదరావునాయుడు. ఐ.జానకిరామయ్య, పిన్నింటి రామారావు నాయుడు, వై.గోవిందరావు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న నాయకులు

మృతుని కుటుంబానికి అండ

కవిటి: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన మండలంలోని జగతి పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయుడు పాండవ కిరణ్‌కుమార్ కుటుంబ సభ్యులను ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఎపిసిపిఎస్ఇఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, గౌరవ సలహాదారు బి.బాలకృష్ణ తదితరులు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తూ, కిరణ్‌కుమార్ ఆకస్మిక మృతి కుటుంబానికి, విద్యారంగానికి పెద్దలోటన్నారు. కిరణ్ కుటుంబానికి గ్రాట్యుటీ, కుటుంబ పెన్షన్, కారుణ్య నియామకం లభించేందుకు అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కష్ట సమయంలో ఉపాధ్యాయ కుటుంబానికి ఎపిసిపిఎస్ఇఎ అండగా ఉంటుందన్నారు. జిల్లా అధ్యక్షుడు చల్లా సింహాచలం, మాజీ అధ్యక్షులు బెందాళం శోభన్‌బాబు, రాష్ట్ర కౌన్సిలర్ బి.ఈశ్వర్, బి.శంకరం, నర్తు సోమేశ్, తేజేశ్వరరావు, లోకానందం, ధర్మారావు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

పొందూరు: మండలంలోని కనిమెట్ట పంచాయతీ రామదాసుపురంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాల మేరకు ఆదివారం సిసి రహదారులు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఉపాధిహామీ పథకం నిధులు రూ.24.30 లక్షలతో ఆంజనేయస్వామి ఆలయం నుంచి శ్మశానవాటిక వరకు సిసి రహదారి, కాలువ పనులు చేపట్టనున్నారు. టిడిపి నాయకులు అన్నంనాయుడు, ఎస్.భాస్కర్, పాపారావు, రాజు, పైడి రమణ పాల్గొన్నారు.

పాఠశాలల పర్యవేక్షణకు కమిటీల నియామకం

వారానికి ఒక స్కూల్ విజిట్

ప్రజాశక్తి- టెక్కలి

పాఠశాలల విద్యా పర్యవేక్షణకు కమిటీలు నియామకం చేపట్టనున్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు మేరకు ఇందుకు సంబంధించిన ఆదేశాలు వెలువడడంతో మండలస్థాయిలో పాఠశాలలు పర్యవేక్షణకు కమిటీలు నియమించనున్నారు. మండలంలోని ఇద్దరు ఎంఇఒలు ఒకొక్క టీమ్‌కు నాయకత్వం వహించనున్నారు. ఒక మండల విద్యాశాఖాధికారి టీమ్‌లో ఏడుగురు నిష్ణాతులైన సబ్జెక్టు టీచర్లతో కమిటీ ఏర్పడనుంది. ఈ కమిటీలో ఉన్న బృందం వారానికి ఒక పాఠశాల చొప్పున తనిఖీ చేపట్టనున్నారు. నిష్ణాతులైన సబ్జెక్టు ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న బోధన ఏ విధంగా ఉంది. విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నారు అనే అంశాలపై పర్యవేక్షణ చేయనున్నారు. అదే తరుణంలో పాఠశాలల వార్షిక తనిఖీలో భాగంగా రికార్డులనూ పర్యవేక్షించనున్నారు. పాఠశాలల విద్యాస్థాయికి అనుకూలంగా బోధనల్లో ఏమైనా లోపాలు ఉంటే కమిటీ సూచనలు, సలహాలు చేస్తూ... మార్పులు చేపట్టనున్నారు. మండలస్థాయి కమిటీలు పర్యవేక్షణ అనంతరం వారిచ్చిన నివేదిక మేరకు జిల్లా కమిటీ పర్యవేక్షించనున్నారు. ఇందుకు సంబంధించి మూడు కమిటీలు నియమించనున్నారు. వీటిలో ఒక్కొక్క టీమ్‌కు ఒక్కో ఎంఇఒ లీడ్ చేయనున్నారు. వీరి నివేదిక మేరకు రాష్ట్రస్థాయిలో పర్యవేక్షణకు ఒక బృందం కూడా రానుంది. జిల్లాలోని అన్ని టీమ్‌లకు డైట్‌లో చదువుతున్న విద్యార్థులూ భాగస్వామ్యం కానున్నారు. ప్రతి పాఠశాలల్లోనూ ఈ పర్యవేక్షణ చేపట్టడం వల్ల నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ యత్నాలు చేపట్టనుంది. ఏదేమైనా పాఠశాలల పర్యవేక్షణకు కమిటీలు నియామకంపై ఆయా మండలాల విద్యాశాఖాధికారులు తలమునకలై ఉన్నారు.

'ఉపాధి' బిల్లుల చెల్లింపులో జాప్యం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రెడ్డి శాంతి

టిడిపి కూటమి ప్రభుత్వ పాలనలో ఉపాధి హామీ అమలు తీరు అధ్వానంగా ఉందని వైసిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఒక ప్రకటనలో ఆరోపించారు. కూలీలకు ఉపాధి కల్పించడంలో, చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించడంలో తీవ్ర జాప్యం ఏర్పడుతుందన్నారు. దీంతో రాష్ట్రంలో పేదలు, గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి సమయంలో ఉపాధి హామీ అమలు, కూలీలకు సకాలంలో కూలి చెల్లింపులో అత్యుత్తమ ప్రమాణాలు పాటించించారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఎప్పటికప్పుడు సమీక్షించి, పనులు వేగవంతం చేయడానికి కృషి చేశారని అన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి ఈ పథకం కింద చేపట్టిన పనులు ఎంతో దోహదపడ్డాయని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో ఉపాధి హామీ పనులు నిర్వీర్యమవుతుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఉపాధి హామీ కూలీలందరికీ పెండింగ్‌లో ఉన్న కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు.

కూచిపూడి నాట్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

అలరించిన చిన్నారుల నృత్యం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

తిరుమల తిరుపతి దేవస్థానం తిరుచానూరు కార్తీక మాస పద్మావతి బ్రహ్మోత్సవాల్లో శిల్పారామంలో మహతి ఆడిటోరియంలో ఇచ్ఛాపురానికి చెందిన వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులు అద్భుత నాట్యాన్ని అందించారు. నాట్య గురువులు నాట్యాచార్య ఏలేశ్వరపు శ్రీనివాసులు శిష్య బృందం కావ్య, శైలు, పూజా, విజయలక్ష్మి, శ్వేతారాణి, జాగృతి, దీపిక, జైత్రి, జాహ్నవి, లిఖిత, పల్లవి, సింధు, మధు, చంద్రకళ, అక్షయ, హేమలత, సుజాత గాయత్రిలు పాల్గొని చక్కని లయ విన్యాసాన్ని అందించి నాట్యానికి ప్రాణం పోశారు. దశావతారం రామాయణ శబ్దం పాటలకు భక్తులను మంత్రముగ్ధులను చేశారు. ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు, ఏడాదికి రెండుసార్లు చక్కని అవకాశాన్ని కల్పిస్తున్న నాట్య గురువులకు చిన్నారులు తల్లితండ్రులు, అకాడమీ సభ్యులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షులు చిన్నా గురుస్వామి, జయలక్ష్మి దంపతులు, బలివాడ శృతిపట్నాయక్, కార్తీక్ దంపతులకు చిన్నారుల తల్లిదండ్రులు ప్రశంసించారు.

కళింగ విభాగ రాష్ట్ర అధ్యక్షునిగా మురళి

ప్రజాశక్తి- నరసన్నపేట

విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న మురళి

వైసిపి ఎంపిపిగా ఉన్న ఆరంగి మురళికి మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇటీవల రాష్ట్ర కళింగ విభాగ అధ్యక్షునిగా నియమించారు. ఇందులో భాగంగా ఆదివారం వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ కలిసి అభినందించారు. అలాగే పోలాకి, నరసన్నపేట మండలాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు మురళికి అభినందనలు తెలిపారు. పోలాకి మండలంలో సుసరాంలో ఏర్పాటు చేసిన మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో రహిమాన్‌పురం సర్పంచ్ స్నానాలు సోమేశ్వరరావు, దుంపల భాస్కరరావు, బెండి శ్రీనివాసరావు, అల్లు అసిరినాయుడు, కణితి కృష్ణారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లింగరాజు

నైతిక విలువలు కలిగి ఉండాలి

నరసన్నపేట: విద్యార్థులు నైతిక విలువలు, సమగ్రత అలవర్చుకోవాలని, ఇది కేవలం విద్యాపరమైన విజయానికి మాత్రమే కాకుండా సంపూర్ణ వ్యక్తిత్వానికి అవసరమని విశ్రాంత తహశీల్దార్ ఉప్పు లింగరాజు అన్నారు. స్థానిక ఇందిరానగర కాలనీలో స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్ ముగింపులో పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ లక్ష్య సాధనలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవడానికి అచంచలమైన ఆత్మవిశ్వాసం, పట్టుదల అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, సిద్ధాశ్రమం అధ్యక్షులు పొట్నూరు కృష్ణారావు, ఉపాధ్యాయులు ఝాన్సి, పిఇ కె.రాము పాల్గొన్నారు.

కత్తెర పెడితే మామూళ్లు ఇవ్వాల్సిందే

ప్రజాశక్తి- అరసవల్లి

ప్రసిద్ధి చెందిన అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ పుణ్యక్షేత్రంలో ప్రతి దానికి మామూలు పడితేగాని పని జరిగేటట్లు లేదని సాధారణ యాత్రికులు వాపోతున్నారు. ఈ సందర్భంగా వివరాల్లోకి వెళ్తే అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి దర్శనానికి ముందు తలనీలాలు సమర్పించుకొని దర్శించుకోవడం ఆనవాయితీ. శాశ్వత క్షురకులు లేకపోవడం వలన కొంతమంది తాత్కాలిక క్షురకులు యాత్రికుల దగ్గర డబ్బులు వసూలు చేసి దోపిడీ చేస్తున్నారు. తలనీలాలు సమర్పించుకొనే ముందు దేవాలయ అధికారులు ప్రకటించిన సూచన మేరకు రూ.40 చెల్లించి రశీదు తీసుకొని క్షురకులకు ఇచ్చి తలనీలాలు సమర్పించుకోవడం సర్వసాధారణం. అయితే చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతీ ఒక్కరికి రూ.40 చెల్లించడమే కాకుండా చిన్నపిల్లలకైనా, పెద్దవారికైనా, మహిళలు కురులు సమర్పించిన ప్రతిఒక్కరు రూ.50 వేరేగా సమర్పించు కోవాల్సి వస్తుందని యాత్రికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే మహిళలు రూ.40 ఇవ్వాల్సిన అవసరం లేదుగాని రూ.50 మాత్రం క్షురకులు డిమాండ్ చేసి తీసుకుంటున్నారని యాత్రికులు వాపోతున్నారు. ఈ విషయంపై ఆలయ ఇఒ కెఎన్‌విడివి ప్రసాద్‌ను వివరణ కోరగా పరిశీలిస్తానని, ఇప్పటికే ఒకరిని సస్పెండ్ చేశామని తెలిపారు. వెంటనే ఆయన తలనీలాల వద్ద పరిశీలించారు. ఇది ఇలా ఉండగా ఆదివారం రూ.7 లక్షల 36 వేల 735 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. టికెట్లు రూపేనా రూ.4 లక్షల 55 వేల 800, పూజలు, విరాళాల రూపంలో రూ.64 వేల 700, ప్రసాద విక్రయాల ద్వారా రూ.2 లక్షల 46 వేల 735 ఆదాయం వచ్చిందని ఇఒ తెలిపారు.

తలనీలాల కౌంటర్ వద్ద యాత్రికులతో మాట్లాడుతున్న ఇఒ

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మేజర్ టెక్కలి పెద్దబ్రాహ్మణవీధికి చెందిన బిసాయి లక్ష్మణ్ (36) ఆదివారం మధ్యాహ్నం విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. తన ఇంట్లోని విద్యుత్ వైర్లను తాకడంతో షాక్‌కు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షంగా అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు.

నుజ్జయిన కారు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

టెక్కలి రూరల్ : విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు నుజ్జు నుజ్జయింది. ఈ ఘటన టెక్కలి మండలం వేముల వాడ గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. నౌపడ-టెక్కలి వైపు వస్తున్న కారు విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో విద్యుత్, తీగలు తెగి పడ్డాయి. వాహనంలో ఉన్న పరారీలో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆ సమయంలో ఎవరూ లేక పోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ వైర్లను మరమ్మతులు చేపట్టారు.

న్యాయవాది భగవాన్ మృతి

ప్రజాశక్తి- సోంపేట

భగవాన్ (ఫైల్)

సోంపేటకు చెందిన న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సి.ఎస్ భగవాన్ ఆదివారం మృతి చెందాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతిపై స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు తమ సంతాపం తెలియజేశారు.

ఆటలు ఆడుతున్న చిన్నారులు

విహారయాత్రలో విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకు ళం రూరల్

స్థానిక బ్యాం కర్స్ కాలనీలో ఉన్న విశాఖ స్కూల్ ఎల్‌కెజి, యుకెజి విద్యార్థులు ఆది వారం బలగలో ఉన్న ఐటిడిఎ పార్కుకు విహార యాత్రకు వెళ్లారు. ఈ సందర్భంగా టీచర్స్ పి సంధ్య, కె.శ్రీవాణి మాట్లాడుతూ చిన్నారులకు విద్యతో పాటు ఆట పాటలు, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. వారితో పాటు స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీకి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- ఆమదాలవలస



సాయి దీక్షిత్

మండలంలోని శ్రీనివాస చార్యుల పేటకు చెందిన కొణపల సాయి దీక్షిత్ రాష్ట్ర రాజధాని అమరావతిలో ఈనెల 26న నిర్వహించనున్న మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆదివారం అమరావతికి బయల్దేరి వెళ్లాడు. సాయి దీక్షిత్ బూర్జ మండలంలోని ఒవిపేట మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీలో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకొని గ్రామానికి పేరు తెచ్చిన సాయి దీక్షిత్‌ను గ్రామస్తులు, విద్యార్థులు అభినందించారు. అలాగే తల్లిదండ్రులు కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

లావేరు: ప్రతి విద్యార్థి బాలసాహిత్యము పుస్తకాలు, నీతి కథలు పుస్తకాలు ఉన్నాయని అందులో నీతి తెలుసుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో విద్యార్థులు నీతి కథలు చదివి పిల్లలకు వినిపించారు. బాగా చదివిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గ్రంథాలయం తరుపున అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'రైతన్న మీకోసం'

ప్రజాశక్తి- మెళియాపుట్టి, ఆమదాలవలస, బూర్జ

ఈ నెల 24న నుంచి 29 వరకు రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల ఆధ్వర్యాన 'రైతున్న మీకోసం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మెళియాపుట్టి, ఆమదాలవలస, బూర్జ ఎఒలు దానకర్ణుడు, మెట్ట మోహనరావు, డి.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ పశుసంవర్ధక సహాయకులు, గ్రామ ఇంజినీరింగ్ సహాయకులు, గ్రామ విద్యుత్ సహాయకుల, అభ్యుదయ రైతులు, నీటి సంఘ సభ్యులు, పిఎసిఎస్ సభ్యులు పాల్గొంటారన్నారు. ముందుగా రైతులకు సిఎం సందేశాన్ని తెలియజేస్తారని తెలిపారు. ప్రతి మూడు రైతు కుటుంబాలనూ ఒక క్లస్టర్‌గా చేసుకొని ప్రభుత్వ తీసుకొచ్చిన ఐదు సూత్రాలను వివరంగా తెలియపరుస్తారని అన్నారు. రైతుల వివరాలను ఆపైమ్స్ యాప్‌లో పొందుపరుస్తారని తెలిపారు. రైతులకు ఆపైమ్స్ యాప్ వినియోగం గురించి తెలియజేస్తారని అన్నారు. రోజుకు 90 కుటుంబాల వివరాలను యాప్‌లో పొందుపరుస్తారని తెలిపారు. ఈ నెల 30 నుంచి వచ్చే 2 వరకు రైతుల నుంచి సేకరించిన వివరాలను కన్ఫర్మ్ చేసుకుని 3న వర్క్‌షాప్ తయారు చేస్తారన్నారు. రానున్న రబీ, ఖరీఫ్‌కు ప్రణా ళికలు రూపొందిస్తారన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.